



బుచ్చి : పారువేట ఉత్సవంలో పెనుబల్లికి తరలివెళుతున్న మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి



ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న కనుమ వేడుకలు
- ఇంటింటా బంధుమిత్రుల కోలాహలం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- గ్రామదేవతలకు వైభవంగా గ్రామోత్సవం
- పలుచోట్ల రంగవల్లులు, పతంగుల పోటీ
- వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు, ఎడ్ల పోటీల నిర్వహణ



రాజరాజేశ్వరి అమ్మవారికి పారువేట అలంకారం



కావలి : గ్రామోత్సవంలో శ్రీకలుగోళశాంభవి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రజలంతా మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్ల సందడి, బంధుమిత్రుల కోలాహలం, రంగవల్లులు, పతంగుల పోటీలు, కోడిపందేలు, ఎడ్ల పోటీల వంటి వాటిని వేడుకగా నిర్వహించారు. వివిధ ఆలయాలకు తరలి వచ్చిన భక్తులతో ఆలయాలన్నీ కళకళలాడాయి. ఇంటింటా పొంగళ్లు పొంగించి పెద్దలకు పూజలు చేశారు. తమ పూర్వీకులు ఆత్మశాంతి కోసం సమాధులను అలంకరించి, వారికి ఇష్ట వంటకాలను నైవేద్యంగా పెట్టి స్మరించుకున్నారు. పెద్దల పండుగ కోసం ప్రభుత్వం తరఫున మౌలిక సదుపాయాలు కల్పించారు.

● కనుల పండువగా కనుమ

జిల్లా వ్యాప్తంగా బుధవారం కనుమ పండుగ కనుల పండువగా జరిగింది. రైతులు తమ ఇళ్లలో, అర్చకులు, ప్రముఖులు ఆలయాల్లో గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను స్నానాలు చేయించి, రంగులు, పూల దండలతో అలంకరించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని రైతలు తమ ఇష్టదైవాలను పూజించారు. అలాగే దేవదాయ పరిధిలోని అన్నీ ఆలయాల్లో వైభవంగా కనుమ గోపూజలు జరిగాయి.

● నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి, మూలాపేట వేణుగోపాలస్వామి, అయ్యప్పగుడి, మూలాపేట మూలస్థానే శ్వరాలయాల్లో గోపూజలు జరిగాయి. గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో తొలిసారిగా కనుమ పండుగను నిర్వహించారు. ఆలయ ఈవో వీ గిరికృష్ణ ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయం ప్రకారం కనుమ పండుగను నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

● ఘనంగా పారువేట

కనుమ సందర్భంగా స్వామివార్లకు ఘనంగా పారువేట నిర్వహించారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, నవాబు పేట, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో చిన్నా పెద్దా ఆలయాల నుంచి స్వామి, అమ్మవార్లు తరలివచ్చి భక్తులకు ఆశీస్సులు అందించారు.

● వైభవంగా తెప్పోత్సవం

నగరంలోని జాఫర్‌సాహెబ్ కాలువ మైపాడుగేట్ ఘాట్‌లో బుధవారం రాత్రి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి కనుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. తొలుత స్వామివారు మైపాడు గేటు వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో వేంచేసి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం స్వామివారిని కిసాన్‌నగర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పురపాలకశాఖ మంత్రి పొంగూరి నారాయణ పాల్గొని తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ విద్యుద్దీపాలం కరణ, బాణసంచా వేడుకలు కనువిందు చేశాయి.

కోలాహలంగా తెప్పల పోటీ

నగరంలోని లేక్‌వ్యూకాలనీ స్వర్ణాల చెరువులో బుధవారం కనుమ సందర్భంగా తెప్పల పోటీ జరిగింది. 35వ డివిజన్ టీడీపీ నాయకుడు బర్నబాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీ లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు ప్రజలు భారీగా తరలివచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు.



స్వర్ణాల చెరువులో నిర్వహించిన తెప్పల పోటీ



ఉలవపాడు : ఆలయ కోనేరులో శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం

హోరాహోరీగా కోళ్ల పందేలు
చేతులు మారిన రూ. కోట్లు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా నియోజకవర్గంలో విచ్చలవిడిగా కోడిపందేలు నడిచాయి. నిర్వాహకులు ఎంట్రీ టికెట్లు పెట్టి మూడురోజులపాటు బహిరంగంగా పందేలు నిర్వహించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పందెంరాయుళ్లు హాజరుకాగా, పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారు. ఉలవపాడు మండలం రామాయపట్నం సమీపంలో అధికార పార్టీకి చెందిన మండల నేత ఈ కోడిపందేలకు ఏర్పాట్లు చేశారు. కందుకూరు మండలం పలుకూరు సమీపంలో ఆ గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. కోళ్లతో హాజరయ్యే వారు రూ.1000, వీక్షించేందుకు వచ్చేవారు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లిస్తేనే బరిలోకి నిర్వాహకులు అనుమతించారు. అలాగే అక్కడికి వచ్చే కార్లు, మోటా రుసైకిళ్లు, ఇతర వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేశారు. రూ. 10వేలు, రూ. 20వేలు, రూ. 30వేలు విభాగాలుగా విభజించి బెట్టింగ్‌లు జరిపారు. ఈ మూడు రోజులలో పదినుంచి పదిహేను కోట్ల రూపాయ లు చేతులు మారాయని అంచనా వేస్తున్నారు.



పలుకూరు వద్ద ఏర్పాటుచేసిన బరిలో తలపడుతున్న కోళ్లు



బ్రాహ్మణక్రాకలో ఎడ్ల బండలాగుడు పోటీలు



చిత్రగుంటలో కబడ్డీ పోటీలు..

తిరుగు ప్రయాణం..
మరింత భారం

- టికెట్ ధర రెండింతలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్
- ఆన్‌లైన్‌లోనూ యథేచ్ఛగా పెంపు
- ప్రయాణికుల నిలువు దోపిడీ



మినీ బైపాస్‌లో ప్రయాణికుల కోసం వేచి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సొంతూర్లకు వచ్చి తిరిగి వెళ్లేవారికి ప్రయాణం ఖరీదుగా మారింది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా, వేలాదిమందికి ఆ బస్సులు సరిపోలేదు. దీంతో ప్రజలు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పలేదు. ఈ అవకాశం కోసం ఎదురుచూస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు రెండింతలకు పైగా టికెట్ ధర పెంచారు. అంతేకాక వాటిని ఆన్‌లైన్‌లో ఉంచి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు, వైజాగ్, చెన్నైకి తదితర ప్రాంతాలకు పండుగ తర్వాత నడిచే ప్రైవేటు ట్రావెల్స్‌కు నిర్వాహకులు ఇష్టానుసారంగా టికెట్ రేటు పెంచారు. తప్పనిసరిగా వెళ్లాల్సిరావడంతో ప్రజలు అధిక ధరలు చెల్లించి ప్రయాణిస్తున్నారు.

● ఆన్‌లైన్‌లోనూ ధరల పెంపు

టికెట్ల ధరలో వ్యత్యాసం

ప్రాంతం	పాత ధర	పెంచిన ధర
హైదరాబాద్ (నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
హైదరాబాద్(ఏసీ)	రూ.1300	రూ.2000-2500
బెంగళూరు(నాన్ ఏసీ)	రూ.800	రూ.1500-2000
బెంగళూరు(ఏసీ	రూ.1300	రూ.2000-2800

ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు పండుగ రోజుల్లో ప్రయాణికులను దోచుకునే తీరును నేరుగా ఆన్‌లైన్‌లో ఉంచారు. ఆన్‌లైన్‌లో యాప్‌లో భారీగా పెంచిన టికెట్ల ధరలను ఉంచి సీట్లు బుక్ చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి టికెట్ రేటు పెంచు కుంటూ పోతు న్నారు. అయితే అటు ప్రభు త్వం, ఇటు రవాణాశాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు.

● ఆర్టీసీలో సాధారణ చార్జీలే..

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ నుంచి సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, బెంగుళూరు, కర్నూలు, వైజాగ్, చెన్నై ప్రాంతాలకు రానుపోను ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. అంతేకాక ఈ సర్వీసుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ప్రయాణికులు నేరుగా ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చు.

'సర్వేపల్లి'కి మహర్దశ

- రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు
- రూ.50.41 కోట్లతో ఇరిగేషన్‌శాఖ ప్రపోజల్స్
- సోమిరెడ్డి చొరవతో రూ.15 కోట్ల పెంపు
- బండ్‌ను బలపరచి, ఆపై రోడ్డు నిర్మాణం
- తాగు,సాగునీరు, పరిశ్రమలకు ప్రధాన వనరు
- టూరిజం స్పాట్‌గా డెవలప్‌మెంట్‌కు అవకాశం

నెల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాగు, సాగు నీటి అవసరాలకు, పరిశ్రమలకు ప్రధాన వనరుగా ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్‌కు మహర్దశ పట్టనుంది. బ్రిటీష కాలంలో నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. సర్వేపల్లి రిజర్వాయర్‌ను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో త్వరలోనే అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

● 1.73 టీఎంసీల సామర్థ్యం

డెల్టా ప్రాంతంలోని ప్రధాన నీటివన రుల్లో సర్వేపల్లి రిజర్వాయర్ ఒకటి. ఈ రిజర్వాయర్ కింద 15,735 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారింగా మరో ఐదువేల ఎకరాల వరకూ సాగవుతుందని అంచనా. 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలను కూడా పెంచుతోంది. ఇకపోతే ఇప్పటికే కొన్ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నది. భవిష్యత్‌లో ఈ గ్రామాల సంఖ్య 23కు పెరిగే అవకాశాలు న్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల ఈ రిజర్వాయర్ అభివృద్ధికి నోచుకోవడంలేదు. పలుచోట్ల రిజర్వాయర్ కట్ట దెబ్బతింది. కొన్ని చోట్ల రివిట్‌మెంట్ లేకపో వడంతో ఏటా పిచ్చి మొక్కలు పెరగడం, తద్వారా నీటి నిర్వహణ కష్టంగా మారుతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు కట్టకోతకు గురవుతుండడంతో ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వంలో సుమారు రూ.10 కోట్లతో కట్ట అభివృద్ధి పనులు చేపట్టినా, నాడు బిల్లులు సమస్యతో పనులు జరగలేదు.

● సోమిరెడ్డి చొరవతో అంచనాల పెంపు

సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. తొలుత నాబార్డు ఫండ్ కింద జిల్లాకు రూ.100 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆ పరిధిలోనే డెల్టాలోని ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. దీంతో సర్వేపల్లి రిజర్వాయర్‌కు రూ.35.41 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ అభివృద్ధి ఆవశ్యతను వారికి వివరించారు. దీంతో ఉన్నతాధికారులు మరో రూ.15 కోట్లు అదనంగా సర్వేపల్లి రిజర్వాయర్‌కు కేటాయించగా, ఆ మేరకు జిల్లా నుంచి రివైజ్డ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి.

రిజర్వాయర్ బయట భాగంలో డ్రైప్యాకింగ్ అప్రాన్ నిర్మించేలా, లోపల భాగంలో కాంక్రీట్ గ్రౌటింగ్ విత్ అప్రాన్ పనులు చేసేలా ప్రతిపాదించారు. రిజర్వాయర్ బండ్ దూరం 6.8 కిలోమీటర్లు ఉండగా, దానిపై బీటీ రోడ్డు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తద్వారా గొలగమూడి నుంచి ఈదగాలి వరకు గ్రామాల మధ్య రాకపోకలకు సులభమైన మార్గం ఏర్పడుతుంది. ఈ బండ్‌పై లైటింగ్ ఏర్పాటు చేసి బోటింగ్‌కు అవకాశం కల్పిస్తే సర్వేపల్లి రిజర్వాయర్‌ను టూరింగ్ స్పాట్‌గా కూడా అభివృద్ధి చేయవచ్చునని భావిస్తున్నారు. అలానే రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునేందుకు పరిశ్రమలన్నీ ఒకతాటిపైకి వచ్చి పైప లైన్ ఏర్పాటు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది పూర్తయ్యాక పరిశ్రమలకు ఇచ్చే నీటి ద్వారా రాయల్టీని వసూలు చేస్తారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరనున్నది.



కోతకు గురైన సర్వేపల్లి రిజర్వాయర్ కట్టకు వేసిన ఇసుక బస్తాలు

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశాం. రూ.50.41 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ నెల్లూరు డీఈ

● పరిశ్రమలకు ఎంతో అవసరం

సర్వేపల్లి రిజర్వాయర్ అవసరం ఇప్పుడు పరిశ్రమలకు కూడా ఎక్కువవుతోంది. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టుతోపాటు మరో 16 భారీ పరిశ్రమలకు ఈ రిజర్వాయర్ నుంచి నీటిని అందించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సంస్థ క్రిబ్‌కో చేపడుతున్న భారీ పరిశ్రమకు కూడా ఇక్కడి నుంచే నీటిని సరఫరా చేసేందుకు ఉత్తర్వులిచ్చింది. ఇలా కృష్ణపట్నం ప్రాంతంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల నీటి అవసరాలు కూడా సర్వేపల్లి రిజర్వాయర్‌పైనే ఆధారపడి ఉన్నాయి. అదే సమయంలో దేశంలోనే అతిపెద్ద ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల్లో ఒకటైన క్రిస్‌సిటీకు ఇటీవలే ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కృష్ణపట్నం పోర్టు ఆధారితంగా కోట, చిల్లకూరు మండలాల్లో ఏర్పావుతున్న క్రిస్ సిటీకు కూడా నీటి అవసరాలను తీర్చే అవకాశం సర్వేపల్లి రిజర్వా యర్ ద్వారా ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధిపై దృష్టి పెట్టింది.



పెద్దల పండుగ సందర్భంగా బోడిగాడితోటలోని సమాధుల వద్ద మంత్రులు ఆనం రామనారాయణ, పొంగూరు నారాయణ తదితరులు

పురాతన ఆలయాల
పునర్నిర్మాణం

- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మంగళ వారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి నగరంలోని నవాబుపేట ధర్మరాజులస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం బోడిగాడితోటలోని సమాధుల వద్దకు చేరుకుని, పెద్దల పండుగ కోసం అక్కడికి వచ్చిన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నవాబుపేట శివాలయానికి చేరుకుని, పునఃనిర్మాణం గురించి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో శివాలయం పునఃనిర్మాణానికి ఎన్నో ప్రయత్నాలు జరిగినా, టెండర్ల ప్రక్రియ కూడా దాటలేదన్నారు. తమ హయాంలో శివాలయాన్ని పునఃనిర్మించడంతో పాటు నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయ భూమిని 24 కుటుంబాలవారు ఆక్రమించి కాపురాలు ఉంటున్నారని తెలిపారు. వారికి వేరేచోట ఇళ్లు నిర్మించి ఇచ్చి ఆలయభూమి స్వాధీనం చేసుకుంటామన్నారు. పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేస్తున్న ఆనంకు నారాయణ అభినందనలు తెలిపారు.

● బోడిగాడితోట పేరు మార్పు

బోడిగాడితోట శ్మశానవాటికలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రులు ఆనం, నారాయణ, తెలిపారు. బోడిగాడితోట పేరు కూడా మార్పు చేస్తామన్నారు. శ్మశానంలో మహాశివుడు సంచరి స్తారిస్తారు కాబట్టి, ఆ శ్మశానవాటికలో శివతాండవం చేస్తున్న మహాశి వుడి విగ్రహం ఏర్పాటుతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపడుతామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ ఓ.వీ. నందన్, దేవదాయ శాఖ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవో కవిత, టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

● అన్ని స్థానాల్లోనూ కడప జిల్లా వాసులే విజేతలు

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పందేలు అట్టహాసంగా నిర్వహించారు. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు. ఈ పోటీలలో విజేతతో పాటు వరసగా 5 బహుమతులు వైఎస్సార్ కడప జిల్లా ఎడ్ల జతలే గెలుచుకున్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామసర్పంచు మార్తాల చంద్రమౌళిరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానం సాధించడంతో చంద్రమౌళిరెడ్డిని కావలి మాజీ ఎమ్మెల్యే వం టేరు వేణుగోపాల్‌రెడ్డి సన్మానించి రూ.50వేలు, ప్రత్యేక మెమొంటో అంద జేశారు. ద్వితీయ బహుమతి వేముల మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎడ్లు గెలుపొందగా వాటి యజమానికి రూ.40వేలు, మె మొంటో ఇందూరి బ్రదర్స్ అందజేశారు. తృతీయ బహుమతిని ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లి గ్రామానికి చెందిన రైతు మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు గెలుపొందగా రూ.30వేలు, మెమొంటోను పెద్దిరెడ్డి బ్రదర్స్ అందజే శారు. 4వ స్థానంలో మైదుకూరు మం డలం పోతిరెడ్డి పల్లికి చెందిన మూలా సూరారెడ్డి ఎడ్లు నిల్వగా రూ.20వేలు, మెమొంటో, 5వ స్థానంలో నిలి చిన వేముల మండలం బెస్తవారిపల్లి గ్రామా నికి చెం దిన జితిన్ విహాన్ ఎడ్ల జతకు రూ.15 వేలు, మెమొంటోను నిర్వాహకులు అందజేశారు.



ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల, దగుమాటి

వైభవంగా సంగమేశ్వరుడి గిరి ప్రదక్షిణ ప్రారంభం

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ బుధవారం వైభవంగా ప్రారంభమైంది. శ్రీ కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పులి వాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించారు. అనంతరం సంగంలోని ఆంజనేయస్వామి ఆలయంలో విడిది దిగారు. ఈసందర్భంగా ఆలయంలో పండరి భజన, కోలాటాలు ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి ఆలయంలో విడిది దిగిన స్వామివారిని కొండ మలుపు వరకు తీసుకెళ్లి కొరిమెర్ల గ్రామస్థులకు అప్పగించారు. ఈ కార్యక్రమములో పలువురు గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తాళం వేశారు.. తీశారు !

● మద్యం దుకాణం వద్ద హైడ్రామా



మద్యం కోసం వేచి ఉన్న మందుబాబులు

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాలెం మద్యం దుకాణం వద్ద బుధవారం హైడ్రామా చోటుచేసుకుంది. గ్రామంలో దుకాణం ఏర్పాటు విషయంలో కొద్ది రోజుల నుంచి అధికార పార్టీలోని రెండువర్గాల మధ్య నెలకొన్న విభేదాలు మరోమారు బహిర్గతం అయ్యాయి. ఓ వర్గీయులు దుకాణం కావాలంటూ, మరో వర్గీయులు ససేమిరా అన్న తరుణంలో ఈనెల 11న ఎట్టకేలకు దుకాణాన్ని ప్రారంభించారు. నాలుగు రోజులపాటు అమ్మకాలు కొనసాగగా, ఎక్సైజ్ సిబ్బంది బుధవారం అక్కడికి చేరుకొని దుకాణాన్ని మూసివేశారు. దీంతో దుకాణాదారులతో పాటు మందుబాబులు ఎక్సైజ్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పండుగ కావడంతో ఆ సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మందుబాబులు సైతం మద్యం కోసం అక్కడే వేచి ఉన్నారు. ఏమైందోఏమో కానీ గంటల వ్యవధిలోనే తిరిగి తాళాలు తీయడంతో వ్యాపారం యథావిధిగా కొనసాగింది. కాగా హడావిడిగా దుకాణానికి తాళాలు వేసిన సిబ్బంది అమ్మకాలకు అనుమతులు ఇవ్వడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేత దాడి

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అనీల్‌పై అదే గ్రామానికి చెందిన మల్లిఖార్జుననాయుడు అనే వైసీపీ నాయకుడు బుధవారం దాడి చేశాడు. అనీల్ సచివాలయం వద్దకు వెళ్లగా మద్యం మత్తులో ఉన్న మల్లిఖార్జుననాయుడు పాత కక్షలు మనస్సులో పెట్టుకుని దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై అత్యాచారం, హత్యాయత్నం

● కేసు నమోదు

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో నాయబ్ రసూల్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై బుధవారం అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించిన యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కాగా, మహిళ ప్రతిఘటించడంతో కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడగా మహిళ కేకలు వేయడంతో యువకుడు పరారయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సంగం ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పండుగ రోజుల్లో రూ.21 కోట్లకు పైగా లిక్కర్ అమ్మకాలు

నెల్లూరు(క్రైం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రోజుల్లో మందుబాబులు మద్యం మత్తులో మునిగితేలారు. ఈనెల 11 నుంచి 15 వరకు ఎక్సైజ్ అధికారుల లెక్కల ప్రకారం రూ.21 కోట్లకుపైగా మద్యాన్ని డిపో నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న బార్లు, మద్యం దుకాణాలకు పంపిణీ చేశారు. ఈ నెల 11న రూ.5.72 కోట్లు, 12న రూ.4.32 కోట్ల విలువైన మద్యం డిపో నుంచి బార్లు, వైన్ షాపులకు వెళ్లింది. 14,15 తేదీల్లో డిపోకు సెలవు కావడంతో 13న రూ. 11.3 కోట్ల మద్యం డిపో నుంచి షాపులకు వెళ్లింది. మొత్తంగా చూసుకుంటే ఈనెల 11 నుంచి 15 వరకు రూ.21.34 కోట్లకు పైగా మద్యాన్ని మందుబాబులు తాగేశారు. పండుగ రోజుల్లో మందుబాబులు అధికంగా సేవించే బ్రాండ్లు బార్లు, వైన్‌షాపుల్లో ఖాళీ అయ్యాయి. దీంతో ఉన్న బ్రాండ్లనే విక్రయించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	125
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7570
వెండి కిలో ధర	రూ. 92,100
వెండి ఒక గ్రాము	రూ.95.10

జోరుగా కోడిపందేలు

● పోలీసు హెచ్చరికలు బేఖాతరు

ఉదయగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినంలో భాగంగా పలు గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగాయి. మండలంలోని కృష్ణంపల్లి, వెంకట్రా వుపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి తదితర గ్రామాల్లో కోడిపందేలను నిర్వాహకులు జోరుగా నిర్వహించారు. కోడిపందేలను తిలకించేందుకు మండలంతో పాటు ఇతర మండలాలకు చెందిన పలువురు వాహనాల్లో తండోపతండాలు చేరుకున్నారు. స్థావరాల వద్ద బెట్టిం గ్‌లు సైతం జోరుగా సాగాయి. పోలీసు హెచ్చరికలను నిర్వాహకులు బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా కోడి పం దేలు నిర్వహించారు.

పేట్రేగిపోతున్న దొంగలు!

● వ్యవసాయ పరికరాలు, మోటార్ల చోరీ

● నిందితులకు రాజకీయ అండపై రైతుల ఆగ్రహం


● పోలీసుల ఉదాసీనతపై ఆవేదన



చోరీకి గురైన డ్రిప్ పైపు చుట్టలు(ఫైల్)

కలిగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వ్యవసాయ భూముల్లో ఉన్న వివిధ పరికరాలు, విద్యుత్ మోటార్లను యథేచ్ఛగా అపహరిస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. అయితే నిందితులకు రాజకీయ నేతల అండతో పాటు పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం రైతుల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. వివరాల మేరకు.. కొందరు చోరులు స్థానికంగా ఉన్న గొర్రెల కాపరిల ద్వారా ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో సమాచారం సేకరించి రాత్రివేళల్లో ఉద్యాన తోటల్లో వేసిన డ్రిప్ పైపులు, మోటార్‌లు, నీటిపారుదల కోసం వేసిన పైపులు ఇలా వ్యవసాయానికి సంబంధించిన పరికరాలను అపహరిస్తున్నారు. అనంతపురం రెవెన్యూ పరిధిలో మలినేని రమేష్ అనే రైతు తన మామిడి తోటలో డ్రిప్ ఇరిగేషన్ చేసుకున్న అనంతరం రూ.78వేల విలువైన 13 పైపు చుట్టలు మిగలగా వాటిని తోటలోనే జాగ్రత్త పరచాడు. ఆ పైపులు గతనెల 18న చోరీకి గురయ్యాయి. స్థానిక రైతులతో కలిసి విచారించగా అనంతపురంకు చెందిన ఆటోడ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్‌లు గొర్రెల కాపరిలతో రెక్కీ నిర్వహించి పొలంలో ఉన్న 13 డ్రిప్ పైపుల చుట్టలను అపహరించి ఎరుకలరెడ్డిపాలెంలోని రైతులకు రూ.6వేల విలువైన ఒక్కో చుట్టను రూ.2వేలు వంతున విక్రయించారు. అయితే బాధిత రైతు ఆ రైతులనేపైపుళతతతల చోరీపై ఆరాతీశారు. దీంతో అది చోరీ సొత్తు అని తెలియగానే కొనుగోలు చేసిన రైతుళలతలలలలులు తిరిగి దొంగలకే ఇచ్చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న బాధిత రైతు సదరు నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈయనతో పాటు పలువురు రైతులు తమ పొలాల్లో విద్యుత్ మోటార్లు, వైర్లు, నీటి పైపులు, ట్రాక్టర్ స్పేర్‌పార్ట్స్, వ్యవసాయ పరికరాలు కూడా చోరీకి గురయ్యాయని వాపోతున్నారు. రాజకీయ పలుకుబడితో సదరు నిందితులు గ్రూపులుగా ఏర్పడి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేసుకునే రైతుల పొలల్లో దొంగతనాలు చేసే ఇలాంటి వారిని రాజకీయ నాయకులు ప్రోత్సాహించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మామిడితోటలో డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని మిగిలిన వాటిని తోటలోనే జాగ్రత్తపరచగా స్థానికంగా ఉన్న వారే రెక్కీ నిర్వహించి చోరీ చేసినట్లు ఆధారలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గకుండా జరిగిన ఘటనపై పోలీసులు లోతైన విచారణ చేసి మరో రైతు నష్టపోకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- మలినేని రమేష్, రైతు

చర్యలు చేపడతాం

వ్యవసాయ పొలాల్లో డ్రిప్‌పైపుల చోరీ విషయమై రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. పలువురు రైతులు కూడా తమ పొలాల్లో వ్యవసాయ పరికరాలు చోరీకి గురైనట్లు పేర్కొంటున్నారు. నిందితులను విచారించి చట్టప్రకారం చర్యలు చేపడతాం.

- ఎస్‌ఐ ఉమాశంకర్

తిరుపతిలో నెల్లూరు వాసి అనుమానాస్పద మృతి



మునెయ్య మృతదేహం



మునెయ్య పాతచిత్రం

ఏర్పేడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు స్టోన్ హౌస్ పేటకు చెందిన పి.మునెయ్య (48) అనుమానా స్పద స్థితిలో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని మేర్లపాక హైవే పక్కన మృతి చెందాడు. స్థాని కుల సమాచారంతో సీఐ జయచంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. సీఐ తెలిపిన వివరాలు... నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటకు చెందిన మునెయ్య భార్య 10 సంవత్సరాల క్రితం చనిపోయింది. ఇతనికి కుమారుడు మునిరాజా ఉన్నాడు. ఇతనికి వివాహమై తిరుపతిలోని మంగళంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటు న్నాడు. నెల్లూరు నగరంలో టీ దుకాణంలో పని చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మద్యానికి బానిసై ఎక్కడపడితే అక్కడ పడిపోతున్నట్లు కుమారుడు తెలిపాడు. సంక్రాంతి పండుగ కోసం మం గళంలోని కుమారుడి ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయం త్రం మంగళం నుంచి తిరిగి నెల్లూరుకు బయలు దేరాడు. అప్పటిమే మద్యం తాగి ఉన్నాడు. మార్గమ ధ్యంలో మేర్లపాక ఎల్లమ్మ ఆలయం వద్ద మళ్లీ మద్యం తాగాడు. మత్తులో కింద పడడంతో తల కు కుడి వైపు నుదుటి భాగంలో రక్తగాయమైంది. అతిగా మద్యం సేవించి మరణించినట్లు తెలుస్తోంది. మునిరాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పశు ప్రదర్శన పోటీల విజేత నెల్లూరు ఎడ్ల జత



మొదటి బహుమతి కైవసం చేసుకున్న ఎడ్ల జత యజమానికి బహుమతి అందిస్తున్న మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి

ఘంటసాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో భాగంగా డాక్టర్ గొర్రెపాటి నవనీత కృష్ణ మెమోరియల్ ఆధ్వర్యంలో ఘంటసాల జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల పూటీలాగుడు పోటీలు మంగళవారంతో ముగిశాయి. న్యూ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో రెండు రోజులపాటు జరిగిన పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. న్యూ జూనియర్స్ విభాగంలో 13 ఎడ్ల జతలు, జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగంలో 11 జతలు ప్రదస్శనలో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పశుపోషకులు తరలిరావటంతో సందడి నెలకొంది. హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి పోటీల నిర్వాహకులను అభినందించారు. పూటీ బండికి టీడీపీ జెండాలు కట్టి నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

● ప్రథమ స్థానం కైవసం చేసుకున్న నెల్లూరు ఎడ్ల జత

జూనియర్ అండ్ సీనియర్స్ విభాగంలో నెల్లూరు జిల్లా ఆలూరు మండలం తూర్పుగోగులపల్లికి చెందిన పల్లిబోయిన సంతోష్ రెడ్డి ఎడ్ల జత 2824.9 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్ల జత 2783.9 అడుగుల దూరం లాగి రెండో స్థానంలోనూ, కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నాదెళ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్ల జాత 2700 అడుగుల దూరం లాగి మూడో స్థానం కైవసం చేసుకున్నాయి. వీరికి నగదు బహుమతులను హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి చేతులమీదుగా అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సూరపనేని రాధా కృష్ణ ప్రసాద్ వ్యవహరించారు. ఒంగోలు జాతి వృషభ రాజముల పూటీ లాగుడు ప్రదర్శన కమిటీ వారి పర్యవేక్షణలో జరిగాయి.

పల్లెల్లో 'సంక్రాంతి' ఘర్షణలు

నెల్లూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న ఆధిపత్యపోరులో భాగంగా నెల్లూరు రూరల్లోని పలు గ్రామాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. గ్రామస్థుల సమాచారం మేరకు.. మాదరాజు గూడూరులో రెండు పాళెల్లో నెలకొన్న ఘర్షణలు పోలీసు స్టేషన్ వరకు వెళ్లాయి. పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో వాస్తవాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుడిపల్లి పాడులోని ఒకే పాళెంలో రెండు వర్గాలు కుమ్ములాడు కున్నాయి. నవలాకులతోట వద్ద 4వ మైలు ప్రాంతంలోనూ రెండు వర్గాలు కొట్టుకున్నాయి. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘర్షణలకు సంబంధించి పూర్తి సమాచారం అందాల్సి ఉంది.

23న 'పరీక్షపై చర్చ' క్విజ్ పోటీలు

నెల్లూరు(విద్య), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈనెల 23వతేదీన కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో పరీక్షపై చర్చ కార్యక్రమం కింద క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో 9 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు నవోదయ విద్యాలయం నుంచి 10 మంది, రాష్ట్ర బోర్డు, సీబీఎస్ఈ స్కూల్స్ నుంచి 70 మంది, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, కందుకూరు కేంద్రీయ విద్యాలయం నుంచి 20 మంది కలిపి మొత్తం 100 మంది పాల్గొంటారని తెలిపారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్, విద్యార్థులందరికీ ఎగ్జామ్స్ వారియర్స్ పుస్తకాలు అందచేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుటుంబ కలహాలతో రిపోర్టర్ ఆత్మహత్య

ఏఎస్‌పేట, (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఏఎస్‌పేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సయ్యద్ రబ్బాని (36) ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భార్య సబీయాతో గొడవ పడడంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రబ్బానీ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సైదులు కేసు విచారణ చేపట్టారు.

కార్మికులకు భరోసా.. ఈ - శ్రమ్!

● అసంఘటిత రంగాల్లో వారికి ఎంతో మేలు

● ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.2 లక్షలు

● 50 శాతానికిపైగా గాయపడితే రూ.లక్ష సాయం

● జిల్లాలో కార్మికుల సంఖ్య 5లక్షల పైమాటే.. నమోదైంది 1.53 లక్షలే!

● అవగాహన లోపమే ఇందుకు కారణం!

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత రంగ కార్మికుల కోసం 2021, ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన 'ఈ-శ్రమ్' పథకం వారి దరిచేరనంటోంది. మూడేళ్లు దాటినా అధికారుల నిర్లక్ష్యం.. కార్మికుల అవగాహన లోపమే ఇందుకు కారణమవుతోంది. కార్మికుల సామాజిక భద్రతతోపాటు వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ-శ్రమ్ ద్వారా కార్డులను జారీ చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సాయం అందించడం, ఉపాధి కల్పనకు ఇది దోహదపడుతుంది. ఈ - శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారు ప్రమాదవశాత్తూ మరణించినా లేదా శాశ్వత వైకల్యం పొందినా బాధిత కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు పరిహారం అందుతుంది. ప్రమాదంలో 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ. లక్ష వరకు ఆర్థిక సాయం పొందవచ్చు అనివార్య కారణాల వల్ల కార్మికులు ఎవరైనా ఉపాధి కోల్పోతే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తారు.

● అర్హులు వీరే!

భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే వారు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, పౌల్ట్రీ ఫారాల్లో పనిచేసేవారు, జాబ్‌కార్డు ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలు, వీధి వ్యాపారులు, చేతివృత్తిదారులు, వివిధ రకాల కులవృత్తిదారులు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కలాసీలు, ఆటో, రిక్షా కార్మికులు ఈ - శ్రమ్‌లో నమోదు చేసుకోవచ్చు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు, నెలకు రూ. 15 వేల కన్నా తక్కువ ఆదాయం ఉండి, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేని వారంతా అర్హులు.



భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

● ఎలా నమోదు చేసుకోవాలంటే..

ఈ - శ్రమ్‌లో పేర్లు నమోదుకు కామన్ సర్వీస్ సెంటర్, మీసేవా కేంద్రాలు, సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఉంటుంది. ఈ కేవైసీ కలిగిన ఆధార్, దీనికి అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఉన్న మొబైల్ తీసుకొని కేంద్రాలకు వెళితే ఈ - శ్రమ్ కార్డు పొందవచ్చు. ఎలాంటి ఫీజు చెల్లించనవసరం లేదు. అయితే చేసినందుకు మాత్రమే నిర్వాహకులు రూ. 50 తీసుకుని కార్డు ల్యామినేషన్ చేసి ఇస్తారు. ఏదైన సంఘటన జరిగినప్పుడు దీనికి సంబంధించిన ప్రయోజనాలు అందకపోతే 14434 ట్రోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చు.

● అధికారుల నిర్లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ - శ్రమ్ కార్డులు కార్మికులకు భరోసా కల్పిస్తాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు, కార్మికులకు, కులవృత్తిదారులకు అవగాహనలోపంతో పథకానికి నోచుకోలేకపోతున్నారు. అవగాహన కల్పించాల్సిన ఆయా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాలో లక్షలాది మంది కార్మికులు, కూలీలు ఉన్నా అందులో సగం మంది కూడా ఈ - శ్రమ్‌కార్డులకు నోచుకోలేదు.

● 1.53 లక్షల మందికే కార్డులు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలతోపాటు భవన నిర్మాణ కార్మికులు, వివిధ కులవృత్తిదారులు, వ్యవసాయ కూలీలు ఇలా మొత్తం సుమారు ఐదు నుంచి ఏడు లక్షల మంది అసంఘటిత కార్మికులు ఉన్నారు. వీరంతా ఈ - శ్రమ్ కార్డులకు అర్హులే. కానీ ఇప్పటివరకు 1,53,001 మంది మాత్రమే ఈ - శ్రమ్ కార్డులు పొంది ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ - శ్రమ్ కార్డుల పట్ల అన్ని రంగాల్లోని కార్మికులకు అవగాహన కల్పించాలని అసంఘటిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా

పార్వేట ఉత్సవం



కందుకూరు: పార్వేట ఉత్సవం సందర్భంగా కొలువుదీరిన దేవతామూర్తులు

కందుకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కనుమ పర్వదినం సందర్భంగా కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ప్రాంగణంలో బుధవారం రాత్రి పార్వేట మహోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని వివిధ ఆలయాల ఉత్సవమూర్తులు గ్రామోత్సవంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంకు చేరుకుని కొలువుదీరగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల ఏర్పాటుచేయగా అమ్మవారి ఆలయ పూజారులు భక్తులకు అందజేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్వేట మహోత్సవానికి హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంథి మాధవి కుటుంబసమేతంగా అంకమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

కనుల పండువగా వేణుగోపాలుడి తెప్పోత్సవం

●ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం స్వామివారి కోనేరులో కనులపండువగా జరిగింది. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి ఉదయం కల్యాణం నిర్వహించారు. ఎస్సై అంకమ్మ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దపట్టపుపాలెంలో మూడు జిల్లాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి అలగాయపాలెం జట్టుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనయులు అవినాష్, సందీప్‌లు ప్రకటించిన బహుమతి ఎమ్మెల్యే తరఫున రూ.25000 కాపులకు అందించారు.

కలుగోళశాంభవి గ్రామోత్సవం

●కావలిటౌన్ (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ దేవత కలుగోళశాంభవి తిరునాళ్ల, గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. పట్టణంలో మంగళవారం కలుగోళశాంభవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్నేహ యూత్, ఫెండ్లీ యూత్‌లు మూడు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. కళాకారులు అగ్నితో ఎన్టీఆర్ అక్షరాలు ప్రదర్శించడంతో తిలకించిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భావోద్వేగంతో లేచి రెండు చేతులు పైకెత్తి తన ఆనందాన్ని వ్యక్తపరచడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద ప్రారంభమైన గ్రామోత్సవం పట్టణ పురవీధుల్లో ఊరేగుతూ బుధవారం రాత్రి తిరిగి ఆలయానికి చేరుకుంది.

మహాలక్ష్మమ్మ మానుకు ప్రత్యేక పూజలు

●సంగం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ వేప మానుకు సంక్రాంతి పండుగని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కలువాయమ్మ, చెన్నకేశవస్వామి గ్రామోత్సవాలు

●కలువాయి (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం గ్రామదేవత కలువాయమ్మ, చెన్నకేశవస్వామి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారికి, చెన్నకేశవస్వామి వారికి టెంకాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చెన్నకేశవ స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

●వింజమూరు (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామికి, గోదాదేవికి, విఘ్నేశ్వరస్వామికి సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వింజమూరు గ్రామంలోని నడిమూరుకు చెందిన యల్లాల చిన్నవెంకటరెడ్డి, పుల్లమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు యల్లాల శ్రీనివాసులరెడ్డి, పద్మావతమ్మ, యల్లాల రఘురామిరెడ్డి, రజని, ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి, మంజుల పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు గణపం రమణారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, మనోజ్, అనీల్, పునీత్, రిత్విక, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీనియర్ నేత వెంకటయ్య మృతి టీడీపీకి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి



వెంగళశెట్టి వెంకటయ్య అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, తదితరులు

సీతారామపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కురువృద్ధుడు, ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంగళశెట్టి వెంకటయ్య మంగళవారం మృతిచెందారు. ఆయన స్వగ్రామం సీతారామపురం గ్రామపంచాయతీలోని సంగసానిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అంత్యక్రియలకు ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి హాజరై వెంకటయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని అన్నారు. అంతిమ క్రతువులో కంభం విజయరామిరెడ్డితో పాటు టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొని వెంగళశెట్టి వెంకటయ్య భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆయన పార్థివ దేహానికి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి అంజలి ఘటించారు. అంత్యక్రియలకు టీడీపీ నాయకులు హాజరై ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వెంగళశెట్టి వెంకటయ్య వ్యవసాయ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి సీతారామపురం మండలంలో టీడీపీని బలోపేతం చేసి మండల టీడీపీ పెద్దాయనగా పేరుపొందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఆయన మృతిచెందారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ జనసేన నాయకులు భోగినేని కాశీరావు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల సీనియర్ నాయకులు చెన్నకేశవులు, జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, భోగినేని కాశీరత్తయ్య, ఎడమ ప్రవీణ్, ఇజ్రాయిల్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ఇంటూరి



చిన్నారికి బహుమతి అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కాపులకు అండగా ఉంటా నని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక బలిజపాలెం గ్రామంలో కోదండరామస్వామి దేవస్థానం వద్ద అడపా వెంకయ్య, పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు మంగళవారం రాత్రి బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద ఆలయ చెర్మన్ మాటూరి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే మూతపడిన పాఠశాలను తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి మాల్యాద్రి, ఏ వెంకట్రావు, యు నాగేశ్వరరావు, ఏ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

కందుకూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18న కందుకూరులో రక్తదానశిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఏటా ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమంతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చొరవతో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెంగమాంబ ఫంక్షన్‌హాలులో జరిగే కార్యక్రమంలో యువత పాల్గొని రక్తదానం చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఘనంగా మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలు

సంగం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టి కృష్ణ ఆధ్వర్యంలో మాయావతి ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జలదంకి : ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యేలు కాకర్ల, కావ్య తదితరులు



కొండాపురం : భీమవరప్పాడులో ముగ్గులు వేస్తున్న మహిళలు



అనంతసాగరం: పడమటి కంభంపాడులో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు

వాడవాడలా అంబరాన్నంటిన పండుగ సంబరాలు

● యువతకు ఆటలు, మహిళలకు ముగ్గుల పోటీలు ● ఉల్లాసంగా ఎడ్ల బండలాగుడు పందేలు ● విజేతలకు బహుమతుల ప్రదానం

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాలలో మహిళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు, యువతకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బ్రాహ్మణక్రాకలో జరిగిన పోటీలలో విజేతలకు మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఇందిర దంపతులు నగదు బహుమతులు అందించారు. గట్టుపల్లిలో టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్దన్‌రెడ్డి పాల్గొని సర్పంచు దంపతులు కాకాణి మహదేవ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

●అల్లూరు,(ఆంధ్రజ్యోతి) : అల్లూరులోని కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 100 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత కందల రాజారెడ్డి, జోసెఫ్, కమల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

●బట్రకాగొల్లులో వ్యాపారవేత్త రాయి సురేష్ తన తల్లి సుందరమ్మ పేరుతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.3000, రూ.2000, రూ.1000 వంతున అందజేశారు. పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

●కొండాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా పిల్లలు, పెద్దలకు విడివిడిగా ఆటలు, క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. భీమవరప్పాడులో ఆటల పోటీలలో విజేతలకు కొమ్మి అంకపనాయుడు, టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, ఏ.సతీష్, వి.శ్రీనివాసులు, కొమ్మి రమేష్‌లు సొంత నిధులతో విలువయిన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నాయకులు గద్దె రాఘయ్య, సీహెచ్.వెంకటాద్రి, వల్లూరు వెంకటేశ్వర్లు, చాగంటి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

●బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావపేటలోని రైల్వే తెలుగు మీడియం పాఠశాల క్రీడామైదానంలో సంక్రాతి సందర్భంగా యంగ్‌లైన్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహేంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మండలంలోని పలుగ్రామాల నుంచి 8 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో లెజెన్స్ జట్టు విన్నర్‌గా బిట్రగుంట ఫుట్‌బాల్ క్లబ్ రన్నర్‌గా నిలిచారు. అలాగే సంక్రాతి సంబరాల్లో భాగంగా పిల్లలు, పెద్దలు, మహిళలకు వివిద రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యంగ్‌లైన్స్ కమిటీ సభ్యులు ఏ.సుబ్బారావు, పీ.శ్రీధర్, సాగర్, రాజశేఖర్, శ్రీనివాసులు, పెండ్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేత జీలు జట్టు

బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో కావలి నియోజక స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో బిట్రగుంట జీలు జట్టు విజేతగా నిలిచింది. బోగోలు, దగదర్తి, జలదంకి మండలాలకు చెందిన 25 జట్ల మధ్య రెండు రోజులపాటు పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన బిట్రగుంట జీలు జట్టుకు షేక్.సుల్తాన్ రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన బేతనీపేట జట్టుకు ముస్తాక్‌బాషా రూ.10 వేలు, మూడవ స్థానంలో నిలిచిన కావలి జట్టుకు ప్రోత్సాహ బహుమతిగా టీడీపీ యువనేత అశోక్‌నాయుడు రూ.5 వేల అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బిజ్జం గోపాలకృష్ణారెడ్డి, శ్రీధర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

●దగదర్తి(బిట్రగుంట) (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం శ్రీరామాపురంలో సంక్రాతి సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. స్థానిక టీడీపీ నేతలు వడ్లపూడి సోలం, రవికృష్ణారెడ్డి, బత్తేపాటి తిరుమల శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విడవలూరు జట్టుకు రూ.15,016 ఈదల రవికృష్ణారెడ్డి, రెండో బహుమతి కొడవలూరు జట్టుకు రూ.13,016 స్థానిక టీడీపీ నేత, మూడవ బహుమతి బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, నాల్గవ బహుమతి గాలి సురేష్‌లు అందచేశారు. ఐదవ బహుమతి కమిటీ సభ్యులు అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ యువత ఇండ్ల కృష్ణయ్య, చంటి, ప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర

సంక్రాంతి సంబరాల్లో బీద సోదరులు

●అల్లూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌లు స్వగ్రామమైన మండలంలోని ఇస్కపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. సోమవారం గ్రామానికి చేరుకుని భోగి, సంక్రాంతి పండుగలో సందడి చేశారు. బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో విజేతలకు ఎంపీ మస్తాన్‌రావుతో కలసి రవిచంద్ర బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాది తరలివచ్చి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గురు సోదరులు ఒకే చోట ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు స్థానికంగా ఉండే అభిమానుల తాకిడితో సంపూర్ణ సంక్రాంతి సందడి నెలకొంది. అదేవిధంగా మండలంలో ప్రజలు సంక్రాంతి పండుగలను వైభవంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కావలి మండలంలో...

●కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): కావలి మండలంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని రుద్రకోటలో ఫైర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి సంబరాలల్లో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణా రెడ్డి పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

●కందుకూరు (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను కందుకూరు పట్టణంతో పాటు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామ గ్రామాన వివిధరకాల ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు గ్రామకమిటీల నేతృత్వంలో బహుమతులు అంద చేశారు. బుధవారం కనుమ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

●లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చినపవని, లింగసముద్రం తదితర గ్రామాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కనుమ పండుగ సందర్భంగా ప్రజలు పశువుల కొమ్ములకు రంగులు వేసి, గోమాతలను పూజించారు.

●వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ప్రజలు మంగళ, బుధవారాల్లో ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కాకుటూరులో డ్యాన్స్‌లు, చుండి, పోలినేనిపాలెం గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కనుమ పండుగ రోజున పాడి రైతులు తమ పశువులకు రంగులతో అందంగా అలంకరించి పూజలు చేశారు.

●ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు వాడవాడలా వైభవంగా జరిగాయి. మంగళవారం పెద్దపండుగను పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్పలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు మకరజ్యోతిని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, అలఘునాథస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆటల పోటీలు జరిగాయి. శ్రీకృష్ణ సేవా సమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంలో కృష్ణమందిరం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సీఐ జి గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య, టీడీపీ నాయకుడు తోడేటి వెంకటయ్య తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. బుధవారం కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు అద్దారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●సంగం : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళ, బుధవారం సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. కనుమ పండుగను పురస్కరించుకుని పశువులను అందంగా తీర్చిదిద్దారు.

మండలంలోని తిరుమనతిప్ప ఎస్టీ కాలనీలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, పరుగు పందెం తదితర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు సాంబయ్య, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాళ్ళచెలిక వీవర్స్ కాలనీలో సంక్రాంతిని పురస్కరించుకుని వీవర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్ల బండలాగుడు పోటీలు

●అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబంపాడు ధర్మపల్లెమ్మ ఆలయం వద్ద బుధవారం కనుమ పండుగను పురస్కరించుకొని ఎడ్ల బండ లాగుడు పోటీలు జరిగాయి. ఈపోటీల్లో మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండవ బహుమతి రూ. 30 వేలు, మూడవ బహుమతి రూ. 20 వేలను అందించారు. బహుమతులను ఆత్మకూరు సీఐ గంగాధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. డియ్యల రమేష్, ఈ వెంకటరమణ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. టీడీపీ నాయకులు తాళూరి గిరినాయుడు, మెట్టుకూరు కృష్ణారెడ్డి, శాఖమూరి సుబ్బారావు, మాకిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, చల్లా శివారెడ్డి అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను మంగళ, బుధవారాల్లో ప్రజలు వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు పెద్దల పండగను నిర్వహించారు. కనుమ రోజున పశువులకు పూజలు నిర్వహించారు.

●దుత్తలూరు: మండలంలో మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ రోజున బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు.

హెల్మెట్ తప్పక ధరించాలి



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీలో పరిధిలోని తొమ్మిదోమైలు వద్ద వరదారెడ్డి గిరిజనకాలనీ, బ్రాహ్మణక్రాక ఎస్సీకాలనీలో సీసీ రోడ్లు, రచ్చబండ నిర్మాణం, బాహ్మణక్రాకలో దేవరపల్లి క్రిష్ణారెడ్డి వీధిలో మురుగునీటి కాలువ నిర్మాణానికి బుధవారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచు, ఉపసర్పంచు ఇండ్ల సుధాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 70.255 టీఎంసీల నీరు

అనంతసాగరం జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి బుధవారం 1,941 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 70.255 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ముమ్మరంగా టీడీపీ శాశ్వత సభ్యత్వాల నమోదు

ఉదయగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, ఉదయగిరి, దుత్తలూరు టీడీపీ మండల కన్వీనర్లు చింతనబోయిన బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం, ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, టీడీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులు, పోకల ప్రభాకర్‌రెడ్డి, పాలగిరి మహేష్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు.

●ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు బుధవారం విరుమూరులోని క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం అందుకున్నారు. వరికుంటపాడు మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావుతో సహా గండిపాళెంకు చెందిన నియోజకవర్గ ఐటీడీపీ, గ్రామ బూత్ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరామ్, ప్రాజెక్టు ఛైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్యలు సభ్యత్వ నమోదు కార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వం పట్ల నాయకులు శ్రద్ధ వహించాలని సూచించారు.

●జలదంకి (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకులు టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని పోటాపోటీగా తీసుకున్నారు. మంగళవారం వింజమూరులోని ఉదయగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా మండలంలోని గట్టుపల్లికి చెందిన మండల తెలుగురైతు మాజీ అధ్యక్షుడు కొల్లా క్రిష్ణ రూ.లక్ష చెల్లించి ఎమ్మెల్యే నుంచి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. అలాగే బుధవారం ఉదయగిరి టీడీపీ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు చేవూరి జనార్దన్‌రెడ్డి, గుర్రం ప్రవీణ్, దండా పవన్‌కుమార్‌రెడ్డిలు ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

●కొండాపురం(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపుమేరకు మండలంలోని గరిమెనపెంట పంచాయతీకి చెందిన నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, టీడీపీ నాయకుడు అల్లిక మధులు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి కాకర్ల సురేష్ నుంచి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అలాగే గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం గ్రామానికి చెందిన తెలుగుయువత మాజీ మండలాధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు బుధవారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డీఆర్‌కు నివాళి

కావలిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) 15వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని డీఆర్ స్మారక స్తూపం వద్ద, డీఆర్ ఇండోర్ స్టేడియంలోని డీర్ విగ్రహం వద్ద విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు, ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి అధ్యాపకులు తదితరులు ఘన నివాళులర్పించారు.

గిరిజన కాలనీలో...

కావలి,(ఆంధ్రజ్యోతి): దొడ్ల రామచంద్రారెడి (డీఆర్) వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కావేరిగుంట గిరిజన కాలనీలో డాక్టర్ రాంసెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాంసెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనంతాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, గిరిజనులు తుపాకుల భవాని, రాంబాబు, సుధాకర్, పద్మ, మౌనిక తదితరులు పాల్గొని డీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్య

బిట్రగుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జక్కేపల్లిగూడూరుకు చెందిన పేరం క్రిష్ణమ్మ (56) అనారోగ్య సమస్య కారణంగా ఆత్మహతకు పాల్పడింది. ఈ మేరకు ఆమె భర్త రఘురామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. క్రిష్ణమ్మ ఐదేళ్ల నుంచి గుండె, కడుపు నొప్పులతో బాధపడుతోంది. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు ఇద్దరు కుమారులు, కోడళ్లు ఇంటికి వచ్చారు. అదే రోజు ఆమె కడుపులో నొప్పి భరించలేక అవస్థపడింది. ఆసుపత్రికి వెల్దామను కుంటున్న లోపే ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయం

ఆత్మకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి దాతృత్వం అభినందనీయమని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలోని నిత్యాన్నదాన ప్రాంగణంలో బుధవారం సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని పలువురు టీడీపీ నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.


వాతావరణశాఖ సంబరాలు

కావలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భారత వాతావరణశాఖ దేశసేవలో 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కావలి వాతావరణ శాఖ కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. వాతావరణశాఖ ఇన్‌చార్జి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ఈ సందర్భంగా బహుమతులు అందచేశారు.

నగరంలో పెన్నా నది తీరాన గురువారం జరగనున్న ఏటి పండుగకు చేస్తున్న ఏర్పాట్లు



● ఇంటింట సందడి
● ఆలయాల్లో ఉత్సవాలు







నగరంలో జరిగిన పారువేట ఉత్సవంలో కొలువుదీరిన అయోధ్య బాలరాముడు, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

ఇంటింటా సంక్రాంతి

నెల్లూరు (సిటీ), జనవరి 15(ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతి పండుగను నగరవాసులు ఘనంగా జరుపుకున్నారు. ఇంటింట పండుగ సందడి నెలకొంది. నూతన వస్త్రాలు ధరించి, పొంగళ్లు పొంగించారు. ఇష్టదైవాన్ని పూజించి పిండి వంటలు ఆరగించారు. సమాధుల తోటకు వెళ్లికి పెద్దలకు పూజలు చేశారు, తర్పణాలు వదిలారు. పిల్లలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు. ఇక, ఆలయాల్లో విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు జరిగాయి. వేదగిరి క్షేత్రంలో గోదాదేవి కల్యాణం వైభవంగా జరిగింది.



వేదగిరి క్షేత్రంలో గోదాదేవి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి

నెల్లూరు రూరల్‌లోని పల్లెల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బయట ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారితో పల్లెటూళ్లు కొత్తశోభను సంతరించుకున్నాయి. మంగళవారం కొన్ని గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. బుధవారం కనుమ పండగ సందర్భంగా పశువులను శుభ్రం చేసి అలంకరించారు. గోపూజ చేశారు. కాగా, సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరంలోని పెన్నా నదీతీరంలో గురువారం ఏటి పండుగ జరగనుంది. వివిధ ఆలయాల ఉత్సవమూర్తులు కొలువుదీరనున్నారు. గొబ్బెమ్మల ఓలలాడింపు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

వివేకానంద వాకర్స్ సంబరాలు

నెల్లూరు(విద్య), జనవరి 15 (ఆంధ్ర జ్యోతి) : వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దులతో వాకర్స్‌కు ఆశీర్వాదాలు అందజేసి అరిసెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్ర రెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, గౌరవాధ్య క్షుడు మేకల నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెప్పోత్సవంలో మంత్రి నారాయణ, అజీజ్, కోటంరెడ్డి





నమఃశివాయ : పరమేశ్వరుడికి అభిషేకం

గోమాతా నమోనమః మూలస్థానేశ్వర ఆయంలో గోపూజ



తల్లిదండ్రులను గౌరవిస్తే ఉన్నతస్థానం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను గౌరవించి వారి ఆశీస్సులు పొందితే సమాజంలో ఉన్నతస్థాయికి వెళ్లొచ్చని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా చిన్న బజారులో బయ్యా వెంకట రమణయ్య, సరోజనమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వెయ్యి మందికి చీరలు పంపిణీ చేశారు. కోటంరెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్లక్రితం రమణయ్య రాజ్యలక్ష్మి షాపింగ్ మాల్ స్థాపించారని, తండ్రి వారసత్వంగా ఈ రంగంలోకి వచ్చిన వాసు, రవి శుభమస్తు షాపింగ్ మాల్‌ని ఏర్పాటు చేసి రాష్ట్రమంతా విస్తరించారని కొనియాడారు. డీకే డబ్ల్యూ కళాశాల వెనుకవైపు రెండు ఎకరాల స్థలంలో ఫన్ పార్కుని అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బయ్యా సోదరులు, కువ్వారపు బాలాజీ, అంచూరి శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.



పేదలకు వస్త్రదానం చేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

స్నేహితులతో...

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : నుడా చైర్మన్ శ్రీనివాసులరెడ్డి బుధవారం నగరంలో తన కళా శాల స్నేహితులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ ఆధ్వర్యంలో పాబోలు పున్నయ్య, పద్మావతి పేర్లమీద పేదలకు చీరలు పంచిపెట్టారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పొద్దని ఆయన కోరారు,

వైభవంగా మకర విళక్కు



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి మకరజ్యోతి దర్శనం (మకర విళక్కు) వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శబరిమలై సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. ఉదయం స్వామివారికి నెయ్యాభిషేకం, విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మకరజ్యోతి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకట రత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.



అలరించిన రంగవల్లుల పోటీలు


నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : వాసవి క్లబ్ నెల్లూరు సిటీ, రంగనాథ్ నగర్ వాసుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ రోజున రంగవల్లుల పోటీలు జరిగాయి. 140 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుభమస్తు షాపింగ్ మాల్, పెరుమాళ్ సిల్క్స్ అధినేత భయ్యా రవికుమార్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేత శారదకు రూ.4వేల విలువైన పట్టుచీర, ద్వితీయ బహు మతిగా ఎం రమాదేవికి రూ.3 వేలు విలువైన పట్టుచీర, తృతీయ బహుమతిగా మయూరి సుధకు రూ.2వేల పట్టుచీర ఇచ్చారు. ప్రత్యేక బహుమతు లకు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.వెయ్యి విలువైన చీర బహూకరించారు. పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి అందజేశారు. గోధుమపిండి, సేమియా వంటి వి కూడా బహూకరించారు. ఈ కార్యక్రమంలో చలువాది నాగేశ్వరరావు, పొదర్తి బాలాజీ, పబ్బిశెట్టి నందకిషోర్, చలువాది వెంకటేశ్వరరావు, రాచపూటి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రాపత్తు ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం రాపత్తు ఉత్సవాలు కనుల పండువగా జరిగాయి. స్వామివార్లకు ఆళ్వార్ల మోప్పి గానం, దివ్యనాలాయిర ప్రబంధ మోప్పి, శాత్తుముర్రై, ఊంజల్ సేవ జరిగాయి.

కామాక్షితాయి పారువేట ఉత్సవం

● అశ్వ వాహనంపై పెనుబల్లిలో గ్రామోత్సవం ● మొక్కులు చెల్లించిన భక్తులు



రేబాలలో పుట్టాలమ్మ గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా బుధవారం మండలంలోని జొన్నవాడ ఆలయం నుంచి అశ్వ వాహనంపై కొలువుదీరిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలు పెనుబల్లికి పారువేట ఉత్సవంలో తరలివెళ్లారు. మధ్యలో అక్కడక్కడా విడిది చేశారు. మంగళవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి జొన్నవాడలో గ్రామోత్సవం నిర్వహించారు. కాగా, ఆలయంలో బుధవారం లక్ష కుంకుమార్చన జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

పుట్టాలమ్మ గ్రామోత్సవం

మండలంలోని రేబాలలో బుధవారం గ్రామ దేవత పుట్టాలమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదించారు. ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాలలో కనుమ పండుగ రోజున గ్రామంలో నిర్వహించే పుట్టాలమ్మ ఉత్సవానికి గ్రామానికి చెందిన వారు ఏ ప్రాంతంలో ఉన్నా తరలిరావడమనేది తరతరాలుగా వస్తున్న ఆచారం. అంతటి పవిత్ర మైన ఊరేగింపు డప్పులు, మంగళమేళాలు విద్యుద్దీపాలంకరణ, ప్రత్యేక పుష్పాలంకరణం భక్తులను అలరించింది. ఈ ఉత్సవానికి చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కాకాణి బతుకే ఫేక్

పొదలకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీని వీడి ఎవరు టీడీపీలో చేరినా, అది కాకాణికి ఫేక్ లాగే కనిపిస్తుందని దీనిని బట్టి కాకాణి బతుకే ఫేక్ అని అమ్మవారి పాలెం టీడీపీ సీనియర్ నాయకుడు అద్దంకి గిరినాయుడు ఎద్దేవా చేశారు. అమ్మవారి పాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్న కర్నాటి పెంచలయ్య, రుపతయ్య (మాజీ ఎంపీటీసీ), కర్నాటి నారాయణ, బాబు, చిన్న పెంచలయ్య, ఉమామహేశ్వర్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి కాకాణి సోషల్ మీడియాలో పోస్టు చేసిన ట్లు ఎవరూ తమను బలవంతం చేయలేద ని వెల్లడించారు. సోమిరెడ్డి అభివృద్ధిని చూసి పార్టీలో స్వతంత్రంగా చేరినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో తమ కాలనీకి ఎలాంటి ప్రయోజనం జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కే.రమేష్‌నాయుడు, వీ.వెంకటేశ్వర్లు, ఆర్.సురేష్‌నాయుడు, పీ.సీతారామయ్య, పూర్ణచంద్రనాయుడు, కే.వెంకటేశ్వర్లు, సంతోష్ పాల్గొన్నారు.

పోలేరమ్మ దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ దయతో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని రామచంద్రా పురం పంచాయతీ వెంకటనారాయణపురంలో టీడీపీ నాయకులు ఆవుల వాసు, గ్రామ కాపులు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పోలేరమ్మ పొంగళ్ల ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక మత్స్యకార మహిళతో కలసి అమ్మవారి పొంగళ్లని తలపై పెట్టుకుని గ్రామ వీధుల్లో తిరుగుతూ ఆలయం వద్ద పొంగళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారాన్ని రామచంద్రాపురం పంచాయతీ నుంచి ప్రారంభించానని, స్థానిక మత్స్యకారులు ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అన్ని వర్గాల వారు సంక్రాంతిని సంతోషంగా జరుపుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, శ్రీహరికోట గోపి, సత్యవోలు సత్యంరెడ్డి, ఆవుల రవిచంద్ర పాల్గొన్నారు.



పోలేరమ్మకు పొంగళ్లు తీసుకొస్తున్న ప్రశాంతిరెడ్డి

ధ్వజస్తంభం ఏర్పాటుపై చర్చలు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 15 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో ఆలయ ఈవో, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రఘు రామశర్మ, వేదపండితుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో పండుగ సంబరాలు

కోవూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో పూలంగిసేవ, పల్లకీసేవ నిర్వహించారు. వీరాంజనేయ స్వామి, కోదండ రామస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, పద్మశాలి యువసేన ప్రతినిధి మునగపాటి రమేష్, నాయకులు కాసా శ్రీనివాసులు, సోమ రాధ, ఐకా నాగేశ్వరరావు, సోమా గోపాల్ పాల్గొన్నారు.

● పొదలకూరు(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నావూరుపల్లిలో కాకు పవిత్ర ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చేబ్రోలు పద్మ, కే లలిత, కాకు ప్రవీణ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరితోపాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి గ్రామ సర్పంచ్ గాలం వెంగయ్య బహుమతులు అందజేశారు. స్పాన్సర్‌గా గాలం హరికృష్ణ, న్యాయనిర్ణేతలుగా ఎ.చంద్రశేఖర్, సుభాష్ వ్యవహరించారు.

● తోటపల్లిగూడూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపాలెం, కొత్తపాలెం, మాచర్లవారిపాలెంలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కొత్తపాలెంలో ముగ్గుల పోటీలు, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నపిల్లలకు పతంగులు పంచారు. మాజీ సర్పంచు చేవూరు శ్రీనివాసులు, ఉప సర్పంచు శ్రీహరి, ఫీల్డ్ అసిస్టెంట్ పొట్లూరి మస్తానయ్య, వేముల శివ నాయుడు, వేమారెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, రాజారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, కనుమ వేడుకలు మండలం లో మంగళ, బుధవారాలు ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా పాడి పశువులకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముదివర్తిలో మాజీ సర్పంచు కొండూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాడి పశువులకు పూజలను నిర్వహించి సుమారు 50 మంది పేదలకు అన్నదానం చేశారు.



కోవూరు : రంగవల్లులు తిలకిస్తున్న రాధాకృష్ణయ్య తదితరులు

● బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో వాడ వాడలా మంగళ, బుధవారాలు యువతీ, యువకులు, మహిళలు, చిన్నారులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. జొన్నవాడ, పెనుబల్లి, దామరమడుగు, కాగులపాడు, మినగల్లు తదితర గ్రామాలలో డీవైఎఫ్ఐ, టీడీపీ, బీజేపీ. జనసేన పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో పలువురు దాతల సహకారంతో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. జొన్నవాడలో కందికట్టు వెంకటరత్నం, నాగమ్మ, కిష్టయ్య, వాసిపల్లి కొండడారెడ్డి, వాసిలి రమణయ్య, జొన్నవాడ సుబ్బరామయ్య, సింగిరి వెంకటసుబ్బయ్య, మద్దిశెట్టి శేషయ్యల జ్ఞాపకార్థం వారి బంధువులు సహకారంతో ఆటలు, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో కనుమ పర్వదినం సందర్భంగా రైతులు పశువులకు పూజలు నిర్వహించారు. జొన్నవాడ ఆలయానికి చెందిన గోశాలలో గోవులు, ఎద్దులు, కోడె దూడలకు రంగులు పూచి పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పొదలకూరు : విజేతలకు బహుమతులందిస్తున్న సర్పంచు వెంగయ్య



టీపీ గూడూరు : క్రికెట్ విజేతకు షీల్డ్ అందిస్తున్న మాజీ సర్పంచు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

● రోడ్డు భద్రతా వారోత్సవాల్లో సీఐ శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు బైక్‌లపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శ్రీనివాసులురెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని దామరమడుగులో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సన్నపురెడ్డిని నియమించాలి

పొదలకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులను మార్చుతున్న తరుణంలో జిల్లాకు చెందిన బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా ఉన్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని బీజేపీ మండల నాయకులు కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షుడు రాచపూటి ధనుంజయరావులు విలేకరులతో మాట్లాడుతూ అనేకసార్లు జిల్లా అధ్యక్షులుగా రాష్ట్రస్థాయిలో అనేక పదవులు అలంకరించిన అనుభవం, ఆర్ఎస్ఎస్‌తో మంచి సాన్నిహిత్యం వున్న నాయకుడైనా సన్నపురెడ్డి నాయకత్వంలో బీజేపీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కోశాధికారి ప్రశాంత్, బీజేవైఎం మండల నాయకులు అక్కిం జనార్ధన్ రెడ్డి, పి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (హరనాథపురం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గవర్నమెంటు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రూపొందించిన 2025వ సంవత్సర డైరీని మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి పీ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల పరుగును చూస్తున్న నటుడు మంచు మనోజ్, మౌనిక దంపతులు

జల్లికట్టు చూసేందుకు మిద్దెలపైకి చేరిన జనం.. కోడెగిత్తలను నిలువరించేందుకు అల్లె అవతల నిలబడిన యువకులు





రంకేసిన కోడెగిత్తలు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాల్లో కనుమ సందర్భంగా బుధవారం జల్లికట్టు నిర్వహించారు. తమ కోడెగిత్తలు, ఆవులు, దూడల కొమ్ములకు రైతులు రంగులేసి నగదు, విలువైన వస్తు సామగ్రిని, వివిధ రాజకీయ నాయకులు, సినీనటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలు కట్టారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎ.రంగంపేట యాదవ వీధిలో వదిలారు. వేలాదిగా వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడ్డారు. రంకెలేస్తూ జోరుగా పరుగు తీసిన కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. చెక్కపలకలను, వస్తువులను సొంతం చేసుకునే ప్రయత్నంలో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువుల ప్రతిఘటనలో కొంతమందికి గాయాలయ్యాయి. కొందరు ఇళ్లపైభాగాన, చెట్ల కొమ్మలపై నిలబడి తిలకించారు. జల్లికట్టు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అరిగిలవారిపల్లెలోనూ జల్లికట్టు ప్రశాంతంగా ముగిసింది. కొందరు స్వల్పంగా గాయపడ్డారు. జల్లికట్టుకు వేలాది మంది జనం తరలిరావడంతో ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా వెళ్ళే రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించింది. ఈ కార్యక్రమంతో ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాలు జనసంద్రమయ్యాయి.

ఏటి పండుగ

కనుమ సందర్భంగా బుధవారం నాయుడుపేటలోని స్వర్ణముఖినది వద్ద ఏటి పండుగ ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరిగే ఈ పండుగ సందర్భంగా మతాలకతీతంగా జనం స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోకి చేరి ఆట పాటలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి



కొండచుట్టు

దేవేరులతో కలిసి శ్రీకాళహస్తీశ్వరుడికి బుధవారం కొండచుట్టు ఉత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ఉదయం ప్రారంభమై గిరి ప్రదక్షిణగా సాయంత్రానికి చేరుకున్నారు. సంక్రాంతి మరుసటి రోజున నిర్వహించే ఈ కార్యక్రమం సందర్భంగా మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి కల్యాణోత్సవానికి దేవతలు, మునులకు ఆహ్వానం పలుకుతారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఎ.రంగంపేటలో ఏఐ టెక్నాలజీ హబ్

● నారావారిపల్లె క్లస్టర్‌కు సీఎం చంద్రబాబు వరాల జల్లు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ సౌజన్యంతో చంద్రగిరి మండలం ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం గ్రామస్తులతో మంగళవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఏఐ టెక్నాలజీ ల్యాబ్ వల్ల క్లస్టర్ పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా రాణించేలా తయారవుతారన్నారు. క్లస్టర్ పరిధిలోని 2160 కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. వచ్చే నెలాఖరులోగా వంద శాతం బహిరంగ మల విసర్జన లేని గ్రామాలు కావాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన 286 మందికి ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇక్కడా పైప్ లైన్ గ్యాస్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపించాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభిస్తున్నామని, తద్వారా ఆధార్, కులం, నేటివిటీ, బర్త్ సర్టిఫికెట్లు, అడంగల్ వంటి 150 సర్వీసుల వరకు అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. నారావారిపల్లె ఆస్పత్రిలో 5 వేల మంది వరకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.8 కోట్లతో ఎ.రంగంపేట నుంచి భీమవరం, మంగళంపేట రోడ్లను పూర్తి చేస్తామన్నారు. 500 మంది వరకు చదువుకునేందుకు, పని చేసేందుకు ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి.. శ్రీసిటీ వంటి పరిశ్రమలతో అనుసంధానించి ఉపాధి కల్పిస్తామన్నారు. రేణిగుంట సమీపంలో 10 ఎకరాల స్థలంలో రతన్ టాటా స్ఫూర్తితో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి ఇక్కడి యువతను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హంద్రీనీవా నీటిని మూలపల్లెకు, కణితమడుగు చెరువులకు, కల్యాణి డ్యామ్, నాగపట్ల, వెంకట్రాయుని చెరువులకు అనుసంధానం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కల్యాణి డ్యామ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాల పంపిణీలో మోసాలు జరగకుండా టెక్నాలజీని వినియోగిస్తామని వివరించారు.



మంగళవారం నారావారిపల్లెకు చేరుకున్న జనం నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు చంద్రబాబు మొక్కులు

సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం

నారావారిపల్లెలో మంగళవారం సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నారా, నందమూరి కుటుంబాలు సందడి చేశాయి. తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా పంచె కట్టిన సీఎం చంద్రబాబు.. తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, దివంగత నారా రామ్మూర్తినాయుడి సతీమణి ఇందిర, సినీహీరో రోహిత్, చంద్రబాబు సోదరి హైమావతి, కుమార్తె చరిత, నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ సతీమణి వసుంధర, చిన్న కుమార్తె తేజస్విని, అల్లుడు, ఎంపీ భరత్, మనవడు ఆర్యవీర్ తదితరులతో కలిసి కలిసి గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు.. కులదైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టకు పాలు పోశాక తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం 11.25 గంటలకు తన తల్లిదండ్రులు నారా ఖర్జూరపునాయుడు, అమ్మణమ్మ సమాధుల వద్ద నివాళులర్పించారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సీఎం ఇంటి బయటే ఉండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలు విన్నారు. అర గంటకుపైగా ఉండి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం తన బంధువు కృష్ణమనాయుడు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. 6.35 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరదరరావు, చంద్రగిరి టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయినుంచి పార్టీ పునర్నిర్మాణం

- కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం
- దొంగ ఓట్ల వ్యవహారాన్ని వదిలిపెట్టేది లేదు
- చంద్రగిరి ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశంలో లోకేశ్

తిరుపతి(విద్య)/చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. వచ్చే నెల నుంచి పార్టీకోసం అధిక సమయం కేటాయిస్తానన్నారు. నారావారిపల్లెలో బుధవారం ఆయన చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. క్లస్టర్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతీఒక్కరూ పార్టీకోసం కొంత సమయం కేటాయించాలని, మరింత చొరవగా పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని, క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు. పార్టీకోసం అహర్నిశలు పాటుపడిన వారికే గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మనం సేవలందించాలని, అహంకారంగా నడుచుకోకూడదంటూ దిశానిర్దేశం చేశారు. యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో తనకు తెలుసని, తప్పుచేసినవారిని ఎవరినీ వదలేది లేదన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో దొంగ ఓట్ల వ్యవహారాన్ని కూడా వదిలిపెట్టేది లేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో సభ్యత్వం చాలాబాగా చేశారని నాయకులు, కార్యకర్తలను అభినందించారు. జనవరి ఒకటి నుంచే పార్టీ సభ్యులకు బీమా అమలవుతోందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే రూ.5 లక్షల బీమా ఇప్పించే బాధ్యత తనదన్నారు. కార్యకర్తల పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని, వారికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలపై దృష్టిసారిస్తున్నామని చెప్పారు. అన్ని మండలాల ముఖ్య కార్యకర్తలను కలివిడిగా పలకరిస్తూ, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హేమేంబరధరరావు, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, బెల్లంకొండ మురళి, తిరుమలరెడ్డి, నాగరాజనాయుడు, ఇతర నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానితో కలిసి నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదం



నాగమ్మ

తిరుపతి, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదాలు సోషల్ మీడియాలో ఘోషిస్తున్నాయి. తనను ఆదుకుని ఇండియాకు పంపించాలంటూ ఆమె చేతులు వేడుకుంటున్నాయి. వెంకటగిరి పరిసర ప్రాంతానికి చెందిన నాగమ్మ.. కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లాలనుకున్నారు. రాజంపేట, కోడూరుకు చెందిన ఇద్దరు ఏజెంట్లు మంచి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. తీరా కువైత్‌కు వెళ్లాక తాను మోసపోయానని తెలుసుకున్నారు. ఎక్కువమంది జనం ఉండే ఇంట్లో ఈమె ఒక్కటే పని మనిషి. రోజురోజుకు పని ఎక్కువ కావడంతో అనారోగ్యం పాలయ్యారు. ఆ ఇంట్లో పని చేయలేనని ఏజెంట్లకు చెప్పినా పట్టించుకోలేదు. చివరికి ఆమె ఫోను చేసినా స్పందించలేదు. అక్కడ్నుంచి బయటపడే మార్గాలను వెదుకుతూ.. ఒంగోలుకు చెందిన సామాజిక సేవకుడు సర్దార్ బాషాకి ఆమె వీడియో కాల్ చేసి తన పరిస్థితిని వివరించారు. తనని ఎడారిలోకి తీసుకెళ్లి చంపేస్తారేమోనని భయంగా ఉందంటూ వీడియోలో విలపించారు. కువైత్‌లోని జహారాలో ఉన్న తనను సేట్ వాళ్లు చిత్ర హింసలు పెడుతున్నారని, అన్నం తిని నాలుగు రోజులైందని, ఒంటినిండా పుండ్లు పడ్డాయని చూపిస్తూ రోదించారు. రూ1.3లక్షలు చెల్లిస్తే ఇండియాకు పంపుతామంటున్నారని, తన దగ్గర రూపాయి కూడాలేదని వాపోయారు. ఈ విషయాన్ని సర్దార్ బాషా తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో దుబాయ్‌లోని తిరుపతివాసి డాక్టర్ ముక్కు తులసికుమార్‌కి చేరింది. వెంటనే స్పందించిన ఆయన తిరుపతి డీఎస్పీ గిరిధర్‌ని సంప్రదించి ఆమె వివరాలు అందించినట్టు తెలిసింది. గత నెలలోనూ శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ కువైత్‌లో నరకయాతన పడుతుంటే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో పోలీసులు చొరవతీసుకుని ఇండియాకు రప్పించిన విషయం తెలిసిందే.

నకిలీ టికెట్లతో దర్శనం: ఇద్దరి అరెస్ట్

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నకిలీ టికెట్లతో దర్శనానికి అనుమతిస్తున్న బాగోతం బుధవారం బయటపడింది. చెన్నైకి చెందిన జగదీష్, తిరుపతికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ శశి, ఫైర్ విభాగంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మణికంఠ గ్రూపు కట్టారు. జగదీష్, శశి పంపే భక్తులకు రూ.300 దర్శన టికెట్లపై పేర్లు, ఆధార్ వివరాలను మణికంఠ ఎడిట్ చేసి నకిలీ టికెట్లను భక్తులకు ఇస్తున్నారు. ఈ టికెట్ల స్కాన్ కేంద్రంలో లక్ష్మీపతి(లక్ష్మీశ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఉద్యోగి) వద్దకు పంపుతున్నారు. అతడు స్కాన్ చేసినట్టు నటించి దర్శనానికి అనుమతిస్తున్నట్లు. విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మణికంఠతోపాటు లక్ష్మీపతిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన 11 మంది భక్తులకు రూ.17 వేలకు ఈ టికెట్లు విక్రయించినట్టు తేలింది. వీరిద్దరిని పోలీసులకు అప్పగించారు. దీనిపై విచారణ మొదలైంది.

ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హోలీక్రాస్ హైస్కూల్ మైదానాల్లో జరిగే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులే అర్హులని తెలిపారు. శుక్రవారంలోపు దరఖాస్తుచేసుకోవాలని.. ఇతర వివరాలకు 93470 38584, 99660 81144, 90596 06346 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మునిరాజా (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సంక్రాంతి పండగ రోజు విషాదం చోటుచేసుకొంది. మండల పరిధిలోని పెరిమిటిపాడు మువ్వాలమ్మ ఆలయ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల బంధువుల సమాచారం మేరకు... తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన వాటంబేడు మునిరాజా(33) తన బంధువు, సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరుకు చెందిన పరంధామ్‌తో కలిసి మోటారు సైకిల్ శ్రీకాళహస్తికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో పెరిమిటిపాడు వద్ద గుర్తు తెలియని వాహన ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్ నడుపుతున్న మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న పరంధామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో పరంధామ్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. మునిరాజా మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ బుధవారం టీడీపీ నాయకులతో కలిసి సూళ్లూరుపేట ప్రభుత్వా స్పత్రికి చేరుకొని మునిరాజా కుటుంబసభ్యులను ఓదార్చారు. రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, వేనాటి రాజారెడ్డి, వేనాటి జనార్దనరెడ్డి ఉన్నారు.

చెరువులో పడి గుర్తుతెలియని యువకుడి మృతి

తడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు చెరువులో పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం చెరువులో తేలియాడుతుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు.

గంగ కాలువలో పడి బాలుడి మృతి


చరణ్ కిషోర్ మృతదేహం

డక్కిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం నరసనాయుడుపల్లెకు చెందిన చరణ్ కిషోర్ (14) మంగళవారం ఉదయం తెలుగుగంగ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు వివరాలు... మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చరణ్ కిషోర్, అదే గ్రామానికి చెందిన మరో బాలుడు విశాల్‌తో కలిసి బహిర్భూమికి వెళ్లారు. కాళ్లు కడుక్కునేందుకు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లారు. విశాల్ కాలుజారి కాలువలో పడిపోవడంతో పక్కనే ఉన్న చరణ్ కిషోర్ అతన్ని రక్షించాడు. మరికొద్ది సేపటికి చరణ్ కిషోర్ ప్రమాదవ శాత్తు కాలుజారి కాలువలో పడి నీటిలో కొట్టుపోయాడు. విశాల్ కేకలు వేయడంతో చుట్టు పక్కల ఉన్న వాళ్లు అక్కడికి చేరుకొనే లోపే చరణ్ కిషోర్ కనిపించకుండా పోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులకు ఫోన్‌లో ప్రమాదం గురించి వివరించి తెలుగుగంగ నీటిని నిలుపుదల చేయించారు. కాలువలో నీటి మట్టం తగ్గగానే బాలుడి మృతదేహం బయటపడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివశంఖర్ తెలిపారు.

పండుగనాడు నీళ్లివ్వకపోడం దుర్మార్గం

పెళ్లకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వాళ్లకు నీళ్లు ఇవ్వనంటూ ఎస్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి దండోర వేయించడం దుర్మార్గమని టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిల్లకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం వైసీపీ నేతకు తగదన్నారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణం ఎలా జరిగిందో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి ఆధారాలు లభ్యమయ్యాక తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాద్ నాయుడు, మురళీ నాయుడు, సిద్దలయ్య నాయుడు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ


దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ధనంజయరెడ్డి

కోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో గిరిజన కాలనీల్లోని 300 కుటుంబాలకు సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త కొడవలూరు ధనంజయరెడ్డి దాతృత్వంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు తన్నమాల కోటారెడ్డి, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ హనుమంత్‌రెడ్డి, నారాయణ, తన్నమాల కోటారెడ్డి, ఎంపీపీ అంజమ్మ, సర్పంచు చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో మంగళవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వృద్ధులకు దుస్తులు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రాజనేని శ్రీనివాసులు నాయుడు, శిరీషమ్మ, రామయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్, మస్తాన్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు, నాంచారమ్మపేట, నక్కలవారికండ్రిగ గ్రామాల్లోని గిరిజనులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శిరిషమ్మ, రామయ్యనాయుడు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల తదితరులు

నాయుడుపేట/టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలలో భాగంగా మంగళవారం నాయుడుపేట పార్కు వద్ద మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి మ్మెల్యే విజయశ్రీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, మాజీ సర్పంచు గూడూరు ప్రభావతమ్మ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పార్థసారధి, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, నానాబాల సుబ్బారావు, అవధానం సుధీర్, చక్రపాణి పాల్గొన్నారు.

సాయినాథుడి తెప్పోత్సవం

వెంకటగిరిటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిగుంటలో సాయినాథుడికి తెప్పోతవం నిర్వహించారు. సాయిబాబాను తెప్పపై అలంకరించి పూజలు చేశారు. తెప్పపై విహరిస్తున్న సాయినాథుడిని భక్తులు దర్శించుకున్నారు.

నవోదయ పరీక్షా కేంద్రం మార్పు

సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈనెల 18న నిర్వహించే పరీక్షా కేంద్రాన్ని మార్పు చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ కె.శేఖర్ తెలిపారు. తొలుత స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మైదానంలో 17 నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ జరుగుతున్న నేపథ్యంలో డీఈవో ఆదేశాల మేరకు పట్టణంలోని వినాయకుడి గుడి వద్దనున్న నారాయణ పాఠశాలకు పరీక్షా కేంద్రాన్ని మార్చినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

17 నుంచి సౌత్ జోనల్ వాలీబాల్ టోర్నమెంట్

వెంకటగిరిటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 17,18 తేదీల్లో సౌత్ జోనల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు తెలిపారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో మొత్తం 25 జట్లు పాల్గొంటాయని, మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.25వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ చెంగల్‌రాయులు, సుబ్రహ్మణ్యం, నిర్వహకులు పాల్గొన్నారు.



బెలూన్ ఎగురవేసి ఏటిపండగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల, విజయభాస్కర్‌రెడ్డి, రఫీ తదితరులు - జనసంద్రమైన స్వర్ణముఖినది

వేడుకగా ఏటి పండుగ

- బెలూన్ ఎగురవేసి ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ
- జనసంద్రమైన స్వర్ణముఖి

నాయుడుపేట/టౌన్, జనవరి 15: నాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలో ఏటి పండుగ వైభవంగా ప్రారంభమైంది. సంక్రాంతి మరుసటి రోజైన నుంచి కనుమ పండుగ నాటి నుంచి మూడు రోజులపాటు ఏటి నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, నెలవల రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ జెయింట్ బెలూన్‌ను వదిలి ఏటి పండుగను ప్రారంభించారు. సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా ఏడాది పండుగను కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం ఇక్కడి విశేషం. హిందువులతో పాటు ముస్లింలు, క్రైస్తవులు కుటుంబసభ్యులతో స్వర్ణముఖినది పరివాహక ప్రాంతానికి తరలివచ్చి ఏటి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. పెద్దలు, చిన్నారులతో కలసి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. గాలిపటాల ఎగురవేత, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, పరుగు పందేలు, డీజే డ్యాన్సలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు.



సూళ్లూరుపేట కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న స్టేజీ - అట్టకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎఫ్‌వో శెల్వ, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, తహసీల్దార్ నరసింహారావు, డీఎఫ్‌వో హారిక

పక్షుల పండుగకు చకచకా ఏర్పాట్లు

తడ/సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో స్టాల్స్ ఏర్పాటుకు టెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు స్టేజీ, పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు డివైడర్లపై పచ్చదనం పరిమళించేలా మొక్కలు ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో పక్షుల పండుగ ప్రారంభంకానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

సూళ్లూరు పేట(ఆంధ్రజ్యోతి): ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను సీఎఫ్‌వో శెల్వం, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం, అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎఫ్‌వో శెల్వం మాట్లాడుతూ పక్షుల పండగకు వచ్చే సందర్శలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో హారిక, రేంజర్ నరసింహరావు, తహసీశీల్దార్ నరసింహారావు పాల్గొన్నారు.

నేలపట్టులో...

దొరవారిసత్రం(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి సీఎఫ్(చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం పరిశీలించారు. పక్షుల కేంద్రంలో స్టాల్స్ ఏర్పాట్లు, వీఐపీ వాహనాల పార్కింగ్, సందర్శకులకు నీటి వసతి, ఇతర సదుపాయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. వారివెంట తహసీల్దారు శైలాకుమారి, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, ఎంపీడీవో గోవర్ధన్, ఇతర అధికారులు, ఉన్నారు.

పండుగ విజయవంతానికి కృషి

తడ(ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మత్స్యశాఖ డీడీ నాగరాజు వెల్లడించారు. బుధవారం అటవీశాఖ సీసీఎఫ్ సెల్వంతో కలసి భీములవారిపాళెం పడవల రేవుకు వచ్చిన ఆయన ఏర్పాట్లపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పడవలరేవులో జెట్టిల ఏర్పాటు, స్టేజీ నిర్మాణం, పార్కింగ్ వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో టూరిజం పీడీ శోభన్‌బాబు, డీఎఫ్‌వో హారిక, సోషల్ వెల్‌ఫేర్ డీడీ చిన్నయ్య, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, విద్యుత్‌శాఖ ఏఈ మురళి తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో గౌరమ్మకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు - చిల్లకూరులో గోమాతకు పూజలు

వైభవంగా సంక్రాతి సంబరాలు

వెంకటగిరి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. గౌరమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మంగళవారం నాడు పెద్దలకు బట్టలు పెట్టారు. కనుమ పండుగ రోజు బుధవారం రైతులు పశువులకు అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని కాశీతోటలో కామాక్షి సమేత విశ్వనాథేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులు గొబ్బి పాటలు పాడుతూ గౌరమ్మను నిమ్మజ్జనం చేశారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు. బంగారుపేటలో గౌరమ్మను తప్పెట్లు, మంగళవాయిద్యాలు, కోటాల మధ్య వైభవంగా నిర్వహించారు.

గూడూరు(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి రోజున మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. మృతి చెందిన కుటుంబ పెద్దల చిత్రపటాల వద్ద కొత్తబట్టలు పెట్టి పూజలు చేశారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా పశువులను అలంకరించి పూజలు నిర్వహించారు. పశువుల కొట్టాల వద్ద ముగ్గులు వేసి, తంగేడు పూలతో గౌరమ్మకు పాడిరైతులు పూజలు జరిపారు.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ గోశాలలో బుధవారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వెంకటరత్నమాచారి సహకారంతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. గో మాతలను అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. అదేవిధంగా మండల ప్రజలు మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ధనుంజయరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, ప్రగతి సేవాసంస్థ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారం కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు. పశువులను శుభ్రం చేసి అలంకరించారు. పొంగళ్లు పొంగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పశువులను అందంగా అలంకరించి పూజలు చేశారు.



డక్కిలి మండలం లింగసముద్రం, బాలాయపల్లి మండలం మన్నూరులో కోడి పందేలు

కోడి పందేల జోరు

డక్కిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాల్లో అన్ని రోజులూ డక్కిలి మండలంలో కోడి పందేల నిర్వహణ జోరుగా సాగింది. సోమవారం డక్కిలికి సమీపంలోని కంథలవారిపల్లి వద్ద, మంగళవారం నాడు శ్రీపురం, ఆల్లూరుపాడు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. బుధవారం లింగసముద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేకంగా బరి నిర్మించారు. ఇతరులు ఎవ్వరూ బరిలోకి రాకుండా ముళ్ల కంపలతో కంచె ఏర్పాటు చేశారు. కోడి పందేలలో పాల్గొనే వారిని మాత్రమే లోనికి అనుమతించారు. కోడి పందేలతో పాటు డైమండ్ డబ్బా, మూడు ముక్కలాట, పేకాట వంటి జూదాలు నిర్వహించారు. పండుగ దినాల్లో నిర్వహించిన కోడి పందేల్లో రోజూ లక్షలాది రూపాలు చేతులు మారినట్లు సమాచారం. కాగా, కోడి పందేల స్థావరాల వద్ద యువత, చిన్న పిల్లలు కూడా ఎక్కుగా కనిపించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు వినిపించాయి.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరులో నాలుగు రోజుల పాటు కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన పోలీసులు నాలుగు రోజులుగా పందేలు సాగుతున్నా అటువైపు చూడకపోవడం గమనార్హం.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పత్రపల్లి, చెలికంపాడు, కుర్నాగుంట గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. దాడులు నిర్వహించి 9కోళ్లు, రూ.27200 నగదు స్వాధీనం చేసుకుని, 24 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. ప్రధానంగా కోట మండలంలోని కర్లపూడి, కొత్తపట్నం, యమదిన్నెపాళెం, చిల్లకూరు మండలం మన్నెగుంట, కాకువారిపాళెం ప్రాంతాల సరిహద్దుల్లో కోడి పందేల నిర్వహణ జరిగింది. నెల్లూరు జిల్లా నుంచేకాక తమిళనాడులోని సేలం ప్రాంతాల నుంచి కోడిపుంజులను తెప్పించారు. ఒక్కో కోడిపుంజును రూ.38వేల నుంచి రూ.50వేలు వెచ్చించి కొనుగోలు చేసి బరిలో నిలిపారు. ఒక్కొక్క తమిళ కోడిపై లక్ష రూపాయలపైనే బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది.

వైభవంగా మకరజ్యోతి వేడుకలు


సూళ్లూరుపేట అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి పూజలు

సూళ్లూరుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా మంగళవారం మకరజ్యోతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి ఆలయంలో ఉదయం అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మకరజ్యోతిని వెలిగించి ఆలయం చుట్టూ ప్రదర్శగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మకరజ్యోతిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అదేవిధంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగేశ్వరస్వామి ఆలయంలోనూ మకరజ్యోతి పూజలు జరిగాయి.

కోట(ఆంధ్రజ్యోతి): కోటలోని ఆర్టీసీ సెంటర్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మకరజ్యోతి వేడుకలు జరిగాయి. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు మకర సంక్రాంతిని పురస్కరించుకొని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో కర్పూరాలతో మకరజ్యోతి వెలిగించారు.

పక్షుల పండుగకు కొరవడిన ప్రచారం

సూళ్లూరుపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పక్షుల పండుగకు ప్రచారం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న ఫెస్టివల్‌పై కనీసం సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో కూడా ప్రచారం అంతంత మాత్రంగానే ఉంది. గతంలో పక్షుల పండుగ అంటే నెల రోజుల ముందే హడావిడి, హంగు ఆర్భాటం ఉండేది. ఈ సారి ప్రకటనే తప్ప పండుగను విజయవంతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ప్రచారం చేసేవారు. ప్రచార పోస్టర్లే కాకుండా ఆయా ప్రాంతాల్లో స్థానిక మీడియా ద్వారా ప్రచారం చేయించేవారు. ప్రస్తుతం స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు కొరిడి - పేర్నాడు, వేనాడు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పక్షులను తిలకించాలంటే ఈ మార్గాల్లో సందర్శకులు వెళ్లాలి. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మరమ్మతులు చేసేవారు. ఈ మార్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయలేదు. పండుగకు నియమించిన ప్రత్యేక కమిటీలు కూడా చొరవచూపక పోవడం గమనార్హం.

పడవలరేవులో పర్యాటకుల సందడి


పడవ షికారుకు వెళ్తున్న జనం

తడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భీములవారిపాళెం పడవలరేవులో బుధవారం పర్యాటకుల సందడి కనబడింది. చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు కార్లు, టెంపోలలో పడవల రేవుకు వచ్చారు. ప్రైవేట్ పడవలను అద్దెకు మాట్లాడుకొని పులికాట్ సరస్సులో షికారుకు ఉత్సాహం చూపారు. మరో రెండు రోజుల్లో పక్షుల పండుగ ప్రారంభం కానుండగా ముందుగానే పర్యాటకులు పడవలరేవుకు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

సదరన్ రైల్వే బోర్డు సభ్యుడిగా పేర్నాటి జోసెఫ్



నాయుడుపేట టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే బోర్డు సభ్యుడిగా నాయుడుపేటకు చెందిన పేర్నాటి జోసెఫ్ నియమితులయ్యారు. ఈ మేరకు సదరన్ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జోసెఫ్‌ను సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ఉపాధ్యక్షుడు ఆర్.రాఘవన్, ఆర్గనైజర్లు కె.కిరణ్, రవి, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

నాయుడుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. 1986-87 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు... 38 సంవత్సరాల అనంతరం కనుమపండుగ రోజు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఆనాటి గురువులైన ఆర్‌బిఎస్ శాస్త్రి, రాజ్యలక్ష్మి, రమణారెడ్డి, శంకర్‌మూర్తిలకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు శేషం మునిగోపి, మధనమోహన్‌రెడ్డి, బాలాజీ, వరకుమార్, గంగాధర్, నిక్సన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో విద్యార్థులకు అవకాశం

గూడూరు అర్బన్, సూళ్లూరుపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 18,19,20 తేదీల్లో జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఇందులో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని డిప్యూటీ ఈవో సనత్ కుమార్ తెలిపారు. ఆసక్తి కలిగినవారు 16వ తేదీ సాయంత్రం లోగా 9441937349, 9346600127 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా క్రీడా పోటీలకు సంబంధించి పురుషులకు వాలీబాల్, కబడ్డీ, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్, బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు 16వ తేదీ సాయంత్రంలోగా 9347038584, 9966081144 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ముగిసిన సౌత్‌జోన్ క్రికెట్ శిక్షణ తరగతులు

గూడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ అనంతపురం క్రికెట్ జట్టు శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య మాట్లాడుతూ తమ కళాశాలలో వారం రోజులుగా జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టుకు తమ కళాశాల పీడీ రవిచంద్ర ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జట్టు ఈనెల 16వ తేదీ నుంచి చెన్నైలో మద్రాసు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సౌత్‌జోన్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

చిల్లకూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి గ్రామంలో బుధవారం అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ, శానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు.